# ఫ్రీడమ్ అట్ మిడ్‌నైట్!

★

రచన : డాక్టర్ జె. భాగ్యలక్ష్మి



వరండాలో పడకకుర్చీలో పార్థసారథి కూర్చున్నాడు. అతని ఎదురుగా చిన్న మోడాపై కరుణ కూర్చుంది.

'నీతో వచ్చిన చిక్కే ఇది కరుణా! ప్రతి చిన్న విషయానికీ మనసు పాడుచేసుకొంటావు' అన్నాడు పార్థసారథి.

'ఇది చిన్న విషయమా' అంది తను కళ్ళు పెద్దవిగా చేసి తన ఒడిలో 'ఫ్రీడమ్ అట్ మిడ్‌నైట్' అనే పుస్తకం ఉంది. ఆమె కళ్ళు ఇంకా తడిగానే ఉన్నాయి.

కరుణ సార్థక నామధేయురాలు, చిన్నప్పటినుండి కష్టం ఎరుగదు. ఎదుటివాళ్ళ కష్టాలకు ఇట్టే కరిగిపోతుంది. ఈ స్వభావం పెళ్ళయిన కొత్తలోనే కనిపెట్టాడు పార్థసారథి. సినిమా చూస్తూ కన్నీరుమున్నీరుగా ఏడవటం, పుస్తకాలు చదువుతూ కళ్ళు తుడుచుకోవటం ఇవన్నీ గమనించాడు పార్థు, ఆదేదో సినిమాలో చిలుకను ఒకడు పీకనులిమినప్పుడు కరుణ పెట్టిన గావుకేకకు సినిమా హాలు మొత్తం దద్దరిల్లిందనవచ్చు. అందుకే అటువంటి దృశ్యాలు వస్తాయని ఏమాత్రం తెలిసినా ముందుగానే కరుణ చేతిని తనచేతిలోకి తీసుకొని నిమురుతూ తనకు వాస్తవ ప్రపంచాన్ని జ్ఞాపకం చేస్తుంటాడు.

ఈరాత్రీ అలాగే జరిగింది. మొత్తం దేశాన్ని ఒక ఊపు ఊపి, అందరి నాళ్ళలో నానిన 'ఫ్రీడమ్ అట్ మిడ్‌నైట్' కరుణ చదువుతూ కూర్చుంది. ఆ రచయితలు కొన్ని అతిశయోక్తులు వ్రాశారని పాఠకుల దృష్టిని ఆకట్టుకోటానికి కొన్ని కల్పనలు చేశారనికూడా తను ఇంతకుముందే వినింది. అయినా ఆ పుస్తకం చదువుతుంటే కలహాలు కళ్ళకు కట్టినట్లు కనిపించగానే కరిగి నీరయిపోయింది. కరుణ మనఃస్థితి పార్థసారథికి బాగానే అర్థమయింది. ఈరాత్రికి తనను కబుర్లలో పెట్టి తన మనసు మళ్ళించకపోతే రాత్రంతా నిద్రపోదు సరికదా అనవసరంగా ఏడ్చి బుర్ర పాడు చేసుకొంటుంది. అందుకే వెన్నెట్లో వరండాలో కూర్చుందాం రమ్మని తనను తీసుకొచ్చాడు.

'ఈ కలహాలగురించి ఎప్పుడూ వినలేదా, చదవలేదా కరుణా?' అన్నాడు అనునయంగా. 'ఏదో ఒకపంక్తీ, ఒకటీ అరా కథ చదవటం వేరు. ఇందులో ప్రతి సంఘటనా కళ్ళకు కట్టినట్లు ఉంది' ఏదో ప్రపంచం నుండి మాట్లాడుతున్నట్టు కరుణ చెప్పుకుపోసాగింది.

'ఏదో నరకం గురించి రాక్షసుల గురించి వింటుంటాం. మనల్ని మించిన రాక్షసులెవరున్నారు?

'క్రూరత్వం మనుషులకీ ఉంటుంది కరుణా. ఎంత క్రూర మృగంకూడా హింస హింసకోసమేనని ఎదుటివారిని చిత్రవధ చేసి ఆనందించలేదు. ప్రతి మనిషిలో

పైశాచికత్వం అణగారి ఉంటుంది. అది మూక ఉమ్మడిగా విజృంభిస్తే పరిణామాలంతే. ఎవరు ముందుగా రాయి విసిరారు అన్నది కాదు కావలసింది. మన ఉన్మాదంలో ఎంతెంత ఘోరాలు జరిగిపోయాయి అన్నదే మనం ఆలోచించాలి'

'మతం తలకు అంత విషాన్ని ఎక్కిస్తే అది లేక పోవడమే మంచిది కదా!'

'మతం ఒక మిషమాత్రమే. మతం లేకపోతే కులాలో, భాషలో, వర్గాలో ఏదో ఒకటి సాకుగా దొరకకపోదు. మన పిచ్చిగాని ఏ మతం మాత్రం హింసాకాండ జరపమని బోధిస్తుంది లోతైన జ్ఞానంలేక నాది వేరు, నీది వేరు అని పైపై అర్థాలకోసం పాకులాడుతారు మనుషులు'

'అయితే అప్పుడు జరిగినవి మత కలహాలు కాదంటారా?'

తమిళనాడు ప్రభుత్వముచే
అంగీకరించబడినది.
ఎల్లప్పుడూ...
LOTUS HAND LOOMS MADURAI.
లోటస్ బ్రాండ్
బెడ్ షీట్స్, టవల్స్, దోవతులు,
టర్కీ జక్కార్డ్, టవల్స్ మరియు
నేప్‌కిన్స్‌నే వాడండి!
: తయారించువారు :
లోటస్ టెక్స్‌టైల్స్
13, ఖాన్‌పాలయం 4 వ వీధి,
మధురై-625009.

'చెప్పానుగా అవివేకంతో, ఆవేశంతో అజ్ఞానంలో జరిగిన అకృత్యాలని' అంతెందుకు మా ఊళ్ళో హిందూ ముస్లింలు కలిసి ఒక పండుగ చేసుకొనేవారు. ఒక ముస్లిం దేవుడు ఒక హిందూ స్త్రీకి పూనకంలా వచ్చేవాడు. ఊరు ఊరంతా ఆమెను కొలిచేవారు. దర్గా కట్టి అందరూ కలిసి ప్రతి శుక్రవారమూ పూజలు జరిపేవారు. సంవత్సరానికి ఒకసారి ఊరేగింపులు జరిపేవారు. మతాలే మనుషుల్ని విడదీస్తే ఈ సామరస్యం ఎక్కడిదంటావు?'

కరుణ పార్థసారథినే చూస్తోంది. గీతా బోధ చేస్తున్న శ్రీకృష్ణునిలా ఉన్నాడు నెమ్మదిగా నవ్వుకొంది. పార్థసారథి చెబుతూనే ఉన్నాడు. 'హింస అనేది రాజుకోవాలేగాని దానికి పరిమితి విధించటం కష్టం. అంతెందుకు ఫ్రెంచి విప్లవంలో ఘోరాలు జరగలేదా? తాతలు చేసిన తప్పులకు మనవలను శిక్షించలేదా? రెండవ ప్రపంచ యుద్ధంలో బాంబులు పడి లక్షలాదిమంది వికలాంగులై పిచ్చివాళ్ళు కాలేదా? వియత్నాం యుద్ధంలో జనం పురుగుల్లా చచ్చిపోలేదా? అకృత్యాలకు బలికాలేదా? పొరుగున జరిగిన బంగ్లాదేశ్ పోరాటంలో సామాన్యుల అగచాట్లు చెప్పటానికి వీలవుతుందా? మనకు చాలా దగ్గరగా మొన్న మొన్న జరిగిన ఆంధ్ర, తెలంగాణా అలజడులలో మాత్రం... ఏది హింస కాదు? ఏ విప్లవం ఎంత మంచి ఫలితాలు తెచ్చినా రక్తం మడుగులు, మానవుల బాధలు తప్పవు.

'ఎంతయినా మనం చరిత్ర సత్యాలకు దూరమయి పోయాం. ఎప్పుడూ సంపాదన, ఆస్తులు, కుటుంబ కలహాలు, చిల్లర మల్లర పోరాటాలు, పగతీర్చుకోటాలు ...నిజమైన బాధ, సమాజాన్ని అట్టుడుకించిన దుఃఖం, దావానలంవంటి ద్వేషంతో దగ్ధమైన హృదయం... ఇవేమిటో మనకు తెలుసా? పాతికేళ్ళు వచ్చిన యువకుడు పదిమైళ్ళ దూరంలో ఉద్యోగానికి వెళ్ళినా పచ్చళ్ళూ, నెయ్యీ వెంటపంటే పరిరక్షిత జీవితానికి మనం అలవాటుపడ్డాం. రక్తపాతమంటే మనకేం తెలుసు? 'హ్యూమన్ సఫరింగ్' మనకేం అర్థమవుతుంది?' అంది కరుణ.

'మూక ఉమ్మడిగా పైశాచికత్వం ఎలా విజృంభిస్తుందో చెబుతాను విను' అంటూ పార్థ తన చిన్ననాటి సంఘటన ఒకటి చెప్పసాగాడు.

'మా ఊరు అటు పల్లెటూరు కాదు, పట్నమూ కాదని నీకు తెలుసు కదా! ఇప్పుడు బాగా పెరిగింది కాని ఇరవై ఏండ్లక్రితం అది చాలా చిన్న ఊరు. అయినా దగ్గరలోని పల్లెలన్నిటికీ అదే పెద్ద ఊరు. అక్కడ వైద్య సదుపాయాలున్నాయి. తాలుకా ఆఫీసు ఉంది. తాతలనాటి కాలేజి ఉంది.

అప్పటికి నేనింకా బాగా కుర్రవాడిని. స్కూల్లో ఏడో ఎనిమిదో చదువుతున్నాను. ఒకరాత్రి లాంతరు దగ్గర కూర్చుని, గండు చీమల్ని చూపుడు వేలుతో దూరంగా తోస్తూ (కారమ్స్ ఆటలాగా) ఏవో తెలుగు పద్యాలు గుడ్డిగా చదువుకొంటున్నాను. సాయంకాలం విధిగా పాఠాలు చదవకపోతే ఇంటిలో బాగా చీవాట్లు పడేవి. బాగా చదువుతున్నాననే అభిప్రాయం వాళ్ళకు కలగటానికి రోజూ గొంతెత్తి తెలుగు పద్యాలే చదివేవాడిని కాబట్టి అవి బాగా కంఠతా వచ్చేశాయి.

ఆరోజు అలా చదువుతుండగా వీధిలో పెద్దగా అరుపులూ, గొడవలూ వినిపించాయి. ఇంటిలో జీతగాళ్ళందరూ ఏమిటా, ఏమిటా అనుకొంటుండగానే నేను పరుగెత్తి వీధిలోకి వెళ్ళిపోయాను. మా ఊరివాళ్ళ యువకులందరూ పెద్ద గుంపుగా చేతిలో కర్రలతో, ఏవేవో తిట్టూ, అరుస్తూ ముందుకు సాగుతున్నారు. నేనూ ఆ గుంపు వెంబడేపోయాను.

వాళ్ళందరూ ఊరి చివర ఉన్న పల్లె చేరుకొన్నారు. 'ఈరిగాణ్ణి' వాళ్ళు నానామాటలూ అంటున్నారు. కాని కులాన్ని ఈసడిస్తున్నారు. నాలుగు అక్షరాలు చదువుకోగానే జనానికి కండ్లు నెత్తికెక్కుతాయి. లేకపోతే ఆ చెవిటిముండావాని కొడుకు పుల్లగాడు అయినింటి ఆడపిల్లకు ఉత్తరం వ్రాస్తాడా? వ్రాసి ఇంకా బ్రతికి బట్ట కట్టామనుకొన్నాడా?

ఇంత జనాన్ని, ఇంత రౌద్రాన్ని చూసి ఆ గుడిసెల లోని వాళ్ళు వణికిపోయారు. జనం అన్ని ఇళ్ళలోకీ దూరబడి ముంతా, మూకుడూ, మూటా, ముల్లే అన్నీ వీధిలోకి విసిరేశారు. లబలబ కొట్టుకొంటున్న వాళ్ళను జుట్టుపట్టుకొని బయటకు లాక్కొనివచ్చారు. చేతికందిన వాళ్ళను చేతికందిన చోట చావబాదుతుంటే వారి హాహాకారాలు మిన్నుముట్టాయి. 'ఏందీ దొరా ఈ అన్నేయం' అన్నదొక ముసలిగొంతు.

'అన్యాయమట్రా, మీవాళ్ళు చేసే పనులు బాగున్నాయట్రా, అయినింటి ఆడపిల్లకు...'

'నీతి తప్పినవాళ్ళను దండించండి, ఏపాపం ఎరగని మమ్మల్నందర్నీ...'

'ఎక్కడ్రా వాడు?'

'బాబ్బాబూ...'

ఇంతలో 'ఈరిగాణ్ణి' పుల్లన్నను లాక్కొచ్చారు. ఈరిగానికి పుట్టెడు చెవుడు. వీళ్ళంటున్న మాటలేవీ వానికి వినిపించటంలేదు. వీళ్ళ దౌర్జన్యానికి బెదురు చూపులు చూస్తూ, చేతులెత్తి దండం పెట్టుతున్నాడు. వాణ్ణి ఒక రాతి చట్రానికి, పుల్లన్నను మరోదానికి కట్టేశారు. వీళ్ళు, వాళ్ళు కర్రలతో కుళ్ళబొడుస్తున్నారు.

ఎన్ని తిట్లుతిన్నా, ఎన్ని దెబ్బలుపడినా పుల్లన్న నోటిలోనుంచి ఒక శబ్దమైనా రాలేదు. ఈరిగాడు మాత్రం, ముసలిప్రాణమేమో, పెడబొబ్బలు పెట్టున్నాడు. కెవ్వున అరుస్తూ అక్కడినుంచి పారిపొయ్యాను. చీకటిలో, ముండ్ల తుప్పలలోపడి ఒళ్ళంతా చీరుకుపోగా ఏడ్చుకొంటూ ఇల్లుచేరాను.

ఇంటిదగ్గర అమ్మ, ఇరుగుపొరుగులు సభతీర్చి మాట్లాడుకొంటున్నారు. నేను వచ్చానని ఎవరూ గుర్తించలేదు.

'అది ఇంతటిది అనుకోలేదమ్మా చూస్తే మెత్తని మనిషిలా ఉంటుంది'

'ఏం మెత్తన! దాని పోయలుచూచి ఎప్పుడో అనుకొన్నాను అది ఇలాంటి పని చేస్తుందని దాని ఒంటిమీద చీరనిలవదే!'

'అదే నా కూతురయితే దాని మెడకొక రాయికట్టి చెరువులోకి తోసేదాన్ని. అంతస్తుమీద అంతస్తుకట్టి పరిపోయిందా నీతీనియమనం లేకపోయినతర్వాత'

'కాలేజికాలేజంతా గుప్పుమంటోందట. ఆ పాడు జన్మ లేకపోతేనేం ఇంత విషం మింగి చావకూడదూ'

నాకు తెగ ఆకలివేస్తోంది. అయినా అమ్మ అక్కడినుంచి కదలలేదు. నేను వరండాలోనే చాపమీదపడి నిద్రపోయాను.

మరుసటిరోజు ఎవరెవరో గట్టిగా అరుస్తున్న శబ్దాలకు మెలకువ వచ్చింది. అమ్మ ఎవరితోనో అంటోంది 'అది అణకువైన బిడ్డకాదమ్మా. ఆ శేషమ్మగోడుచూడ లేకుండా ఉన్నాను. ఇప్పుడు చచ్చి అది అందర్నీ

నవ్వులపాలు చేసింది...' నేను పండ్లు తోముకోటానికి ఇవతలికి వస్తే గొడ్లజీతగాడు చిన్నిగాడు అన్నాడు, శాంతమ్మ చచ్చింది తెలుసా ?!

నేను నోరయినా కడుక్కోకుండా మాడీ మామయ్య గారింటికి పరుగుతీశాను. అక్కడ ఊరుఊరంతా చేరారు. ఎలాగో సందుచేసుకొని లోపలి రూముదాకా వెళ్ళాను. కళ్ళు వికారంగా ఉన్నాయి. భయమేసి పరుగెత్తుకు వచ్చేశాను. ఆతర్వాత రెండురోజులు జ్వరం. ఏమేమో కలవరించానంట. బిడ్డ దడుసుకొన్నాడమ్మా అంటూ అమ్మ మంత్రాల మారయ్యచేత మంత్రం వేయించింది. మా నాన్నమ్మ చీపురుపుల్లలు మంటవేసి దిష్టితీసింది. కాని ఆరోజుల్లో ఎంత తల బద్దలు కొట్టుకొన్నా పుల్లన్నను ఎందుకు అలా హింసించారో, వాళ్ళవారినందరినీ ఎందుకలా బాధించారో, శాంతక్క ఎందుకు చచ్చిందో, అర్థంకాలేదు.

ఆతర్వాత కాలేజీ జీవితంలో స్టూడెంటు సమ్మెలలో హిందీ వ్యతిరేక ఉద్యమంలో, మరెన్నో సందర్భాలలో గుంపులో ఎంత రాక్షసత్వం ఉంటుందో, ఎంతగా విజృంభిస్తుందో దగ్గరగాచూశాను. ఈ హింసారూపం తెలిసి దాన్ని చేరనియ్యకపోవడంకన్నా ఎవరూ చేయగలిగేదేమీలేదు. అటువంటి దారుణాలే ఎదురవుతే 'జాతస్యహి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్యచ' అని గీతను వల్లెవేసుకొని మనసు చక్కబెట్టుకోవాలి అంటూ పార్థసారధి నవ్వాడు.

చీకటినితరిమేస్తూ తూర్పు తెల్లవారింది. ఆ ఊరి ఆలయంనుండి 'కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే...' అంటూ సుప్రభాతం వినిపించసాగింది.

★

''కథాంజలి''లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులుకాదు. —సంపాదకుడు.



# : కొన్ని నిజాలు :

♦ రచన: శ్రీ జి. స్వామి భద్రవతార్ ♦

ఓర్పు-నేర్పు ఉన్నవారే తీర్పు ఇవ్వగల సమర్థులు!

నిజం నిద్దురపోదు-గజం (ఏనుగు) నిద్దుర పోదు!

తప్పు చేసినవారు తప్పించుకొని తిరుగుతారు కాని-, ఒప్పు చేసినవారు నిప్పుల్లా కనిపిస్తారు!

ఆశ లేకపోయినా; దురాశకు మించిపోయినా వారు మనుషులుకారు!

ప్రెసిడెంటు ముసలివాడైనమాత్రానా పదవి ముసలిదికాదు!

బాలునిలో మిక్కిలి తెలివిఉన్నా, బాలుడని తనమాట కాదనిరాదు!

రచయిత రచన అచ్చయినప్పుడు సంబర పడడు. దానిపై వచ్చే వ్యాఖ్యానాలపై తన తృప్తి ఆధారపడి ఉంటుంది!

ఉన్నదిఉన్నట్టుగాచూపిస్తుంది చూపుటద్దం-కాని, దృష్టిలోపాన్ని సవరించి చూపిస్తుంది కళ్ళద్దం!

అప్పులేకపోతే ముప్పు తప్పుతుంది, కాని-, తప్పులేకపోతే ఒప్పు ఎవరిదో తెలుసుకోలేం!

కొడుకుని కనిపెంచి కష్టాలకోర్చి ఒక స్థితికి తెచ్చిన తల్లిదండ్రులు, కొడుకు డబ్బుమీద ఆధారపడితే తప్పంటుంది లోకం!

కూతుర్ని కనిపెంచి పెళ్ళిచేస్తే, నాటినుండి కడవరకు ఆమె బాధ్యత భర్తదేగదా, ఆయ్యో పాపం! అనుకోదేం లోకం!